క్లుప్తంగా

సస్యరక్షణ పాటించాలి

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడులో రైతులకు వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్‌శంకర్ లింగాకర్షక బుట్టల ఏర్పాటు, వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఉమానగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం రానివ్వొద్దు

కూసుమంచి: వేసవికాలం దృష్ట్యా మిషన్ భగీరథ ప్రాజెక్టుతో పాటు ఇతర తాగునీటి పథకాలకు విద్యుత్ అంతరాయం రానివ్వొద్దని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. శుక్రవారం పాలేరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు మిషన్ భగీరథ ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరా తీరును ఏడీఈ కోక్యా నాయక్ ద్వారా అడిగి తెలుసుకున్నాక తాగునీటి పథకాలకు విద్యుత్ సరఫరా సక్రమంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ తావుర్యా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ స్థానాన్ని ముస్లిం మైనార్టీలకు కేటాయించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని ముస్లిం మైనార్టీలకు కేటాయించి, మంత్రి పదవి ఇవ్వాలని పబ్లిక్ ఫర్ సోషల్ జస్టిస్, తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ షేక్ అబ్దుల్ రహిమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం కొనసాగుతున్న క్రమంలో ప్రభుత్వంలో గౌరవప్రదంగా అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని పనిచేయాలని ఆయన కోరారు.

పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న నజీర్‌ను, అనారోగ్యంతో బాధపడుతున్న నూకల కోటేష్‌లను పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వున్నం బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, సైదారెడ్డి, సత్యనారాయణ, రేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

- ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈఈ జి వెంకన్న శుక్రవారం తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్, వీడీవోస్ కాలనీ, విజయ్‌నగర్ కాలనీ, న్యూ విజన్ స్కూల్, బ్యాంకు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.
- నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే క్రమంలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ కె.రామారావు తెలిపారు. దీంతో కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురం, అనంతనగర్, బోదులబండ, రామచంద్రాపురం, కోరట్లగూడెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను ఉండదన్నారు.
- రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని మంచుకొండ ఏఈ సతీష్ పేర్కొన్నారు. దీంతో మంచుకొండ, బూడిదంపాడు, సూర్యతండా, వాంకుడోత్‌తండా, పుటానితండా, హర్యాతండా, బద్యాతండా, కొర్లబోడుతండా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

ఆమె రాణిస్తోంది...



- అన్నిరంగాల్లోనూ అతివల పరుగులు
- పురుషులతో సమానంగా ముందుకు..
- ఇళ్లలోనూ ఆడపిల్లలపై తగ్గుతున్న వివక్ష

ఉద్యోగ, క్రీడా.. ఇతర అన్ని రంగాల్లోనూ గతంతో పోలిస్తే అతివలు రాణిస్తున్నారు. అందివచ్చే అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇళ్లలోనూ గతంతో పోలిస్తే అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను చదివిస్తుండడంతో వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తోంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలు.. ఒకరు లేదా ఇద్దరు అమ్మాయిలు జన్మించినా వారి ఎదుగుదలకు చేయూతనిస్తున్న తల్లిదండ్రుల వివరాలతో కథనాలు...

వ్యవసాయం, కుటుంబ బాధ్యతల్లో..



పొలానికి మందు చల్లుతున్న మంగమ్మ

ఖమ్మంరూరల్: వ్యవసాయం చేయాలంటే పురుషులే ఆలోచించే పరిస్థితుల్లో భూమి దున్నడం మొదలు విత్తనాలు వేయడం, చేనుకు నీరు పెట్టడం, మందులు వేయడం, పంట నూర్పడం, పంట అమ్మడం వరకు అన్నీ తానై చేస్తోంది మండలంలోని తిప్పారెడ్డిగూడెంకు చెందిన గోకినపల్లి మంగమ్మ. గోకినపల్లి ఐలయ్య – రాములమ్మకు నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వీరిలో మూడో సంతానమైన మంగమ్మ చిన్నతనం నుండే వ్యవసాయం చేస్తోంది. అవివాహితగానే ఉండిపోయిన ఆమె ఇద్దరు సోదరీమణులు, సోదరుడి వివాహం కూడా చేసింది.

కొండా.. జాతీయ స్థాయిలో సత్తా



సాధించిన పతకంతో కొండ భవాని

ఖమ్మం స్పోర్ట్స్: కూసుమంచి మండలం పోచారానికి చెందిన కొండా భవాని క్రీడల్లో రాణిస్తోంది. కబడ్డీలో తర్ఫీదు పొందిన ఆమె ఇప్పటి వరకు తొమ్మిది జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. కూలీ పనులు చేసే ఆమె తల్లిదండ్రులు ఎక్కడా వెనుకాడకుండా శిక్షణ ఇప్పించడం, ఎక్కడ టోర్నీలు జరిగిన పంపిస్తుండగా.. రాష్ట్ర, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల బాధ్యులూ సహకరించారు. మూడు సార్లు కాకతీయ యూనివర్సిటీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన భవానీ ప్రస్తుతం హైదరాబాద్ దోమలగూడలోని ఫిజికల్ ఎడ్యూకేషన్ కళాశాలలో బీపీఈడీ కోర్సును చదువుతోంది.

భర్త నడిచిన బాటలో ..



ఫొటో ప్రింట్ తీస్తున్న జహీరాబేగం

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెంకు చెందిన జహీరాబేగం ఫొటోగ్రఫీలో రాణిస్తోంది. ఆమె భర్త సొందు ఫొటోగ్రఫీ రంగంలోనే ఉండగా.. కేన్సర్ బారిన పడి 2015లో మృతి చెందాడు. అప్పటికే వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీంతో భర్త బాటలోనే నడవాలని నిర్ణయించుకున్న జహీరా తొలుత పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీస్తూ పేరు తెచ్చుకుంది. ఆతర్వాత గ్రామాలకు వెళ్లి ఫొటోలు తీయడం ఆరంభించి కుటుంబాన్ని పోషిస్తోంది. ప్రస్తుతం ఆమె కుమార్తె రేష్మా బీఎస్సీ అగ్రికల్చర్, కుమారుడు రుబేబ్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా, జహీరాబేగం గతంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా బెస్ట్ మహిళా ఫొటోగ్రాఫర్ అవార్డు కూడా అందుకుంది.

ఉత్తమ క్రీడాకారిణిగా పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని జై భారత్ లెజండ్స్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ఎంపిక చేసిన ఉత్తమ క్రీడాకారిణుల జాబితాలో ఖమ్మంకు చెందిన ఉషూ క్రీడాకారిణి పవిత్రాచారికి స్థానం దక్కింది. ఈమేరకు హైదరాబాద్‌లో ఆమె అవార్డు స్వీకరించగా డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి తదితరులు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న పవిత్రాచారి

అతివలకు సన్మానం..



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

☞ ఖమ్మం లీగల్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఖమ్మం కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శుక్రవారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ మాట్లాడగా.. మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులను సన్మానించారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, అర్చనకుమారి, రాంప్రసాదరావు, కే.వీ.చంద్రశేఖర్‌రావు, కల్పన, శివరంజని, దీప, బిందు ప్రియా, మాధవి, శాంతి లత, కార్తీక్, కొల్లి సత్యనారాయణ, నేరెళ్ల శ్రీనివాసరావు, చింతనిప్పు వెంకట్, తన్నీరు లలిత, స్పందన తదితరులు పాల్గొన్నారు.

☞ తిరుమలాయపాలెం: మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. విజయకుమారి, విజయలక్ష్మి, గోపమ్మ, కృష్ణకళ, శోభన, శేష ఫణి, జాన్ బి, అరుణ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న క్లబ్ బాధ్యులు

☞ ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కళాశాల పారిశుద్ధ్య మహిళా కార్మికులను, వంటవారిని సన్మానించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.సునీత మాట్లాడగా.. సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిధంగా ఖమ్మంలోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'రాజ్యాంగం–బహుజన మహిళలు సాధికారత'అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు స్వర్ణకుమారి, కామేపల్లి అగ్రికల్చర్ ఏఓ తారాదేవి మాట్లాడాక సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణితో పాటు పలువురిని ఘనంగా సత్కరించారు. సంఘం బాధ్యులు భూక్యా ఉపేంద్రబాయి, జ్యోతి, స్పందన, విజయ, ఝాన్సీ, లక్ష్మిలతో పాటు భద్రూనాయక్, ఫక్రుద్దీన్, విజయ్, రవీందర్,శ్రీదేవి,సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

☞ ఖమ్మంవ్యవసాయం: మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆ శాఖ జిల్లా అధికారి ఎంవీ మధుసూదన్ ఆధ్వర్యాన మహిళా ఉద్యాన అధికారులు, సిబ్బంది, గార్డెన్ వర్కర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు గురునారాయణ, కామేశ్వరరావు, ఖలీల్ పాషా, జహీర్ పాల్గొన్నారు.

☞ ఖమ్మంరూరల్: మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గురుకుల డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.సునీత ఆధ్వర్యాన మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళలకు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

☞ ఖమ్మం సహకారనగర్: మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినుల తల్లులను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, బానోత్ రెడ్డి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ జె.అనురాధ, సభ్యులు, సుజాత, అనిత కుమారి, పి.అనురాధ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.సునంద, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏఆర్ సత్యం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల తల్లులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

హక్కులు పరిరక్షించాలి

ఖమ్మంమయూరిసెంటర్: అట్టడుగు వర్గాల మహిళల హక్కులు పరిరక్షించాలని వైద్యురాలు యలమంచిలి నాగమణి అన్నారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు.మహిళలు ఏ రంగంలోనూ తమ హక్కులను కోల్పోవద్దన్నారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం మహిళా హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, మాచర్ల భారతి, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు రమణ, పి.రమ్య, నాయకులు షేక్ భేగం, అమరావతి పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చర్యలు

ఖమ్మంక్రైం: ఇటీవల కొంతమంది విద్యుత్ వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తూ మీటర్ తిరగకుండా చేయగలమని చెప్పి డబ్బులు వసూళ్లు చేస్తూ మీటర్లలోని కొన్ని వైర్లను కట్ చేసి అక్రమ చర్యలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని ట్రాన్స్‌కో, పోలీస్, విజిలెన్స్ సీఐ వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో విజిలెన్స్, పోలీస్, విద్యుత్‌శాఖ బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలకు ఎవరైనా పాల్పడినట్లు తెలిస్తే వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని , ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాసమస్యలపై క్షేత్రస్థాయి పోరాటాలు

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ సంస్థాగత నిర్మాణం , పార్టీ విస్తృతికి కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జాగర్లమూడి రంజిత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 15 నాటికి గ్రామశాఖ మహాసభలను పూర్తి చేయాలని చెప్పారు. డిసెంబర్ 26న పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సభలు జిల్లాలో జరగనున్నాయన్నారు. ప్రజా సంఘాలు పార్టీ, మండల కమిటీలు క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాట కార్యక్రమాలు రూపొందించుకోవాలని ఆయన కోరారు. రైతాంగ సమస్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ప్రధాన కారణమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కేఎంసీ సమాచారం..

- ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్ పరిధిలోని గ్రెన్ మార్కెట్ రోడ్‌లో కాల్వ పైన చుట్టూ ఇనుప రైలింగ్ పెట్టి ఆక్రమించడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు, డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి తొలగించారు.
- కేఎంసీ పరిధిలోని 28వ, 29వ, 30వ, 32వ, 35వ, 54వ డివిజన్లలో పార్కులను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య హార్టికల్చర్ అధికారితో కలిసి శుక్రవారం సందర్శించారు. పార్కుల నిర్వహణతో పాటు పిల్లల ఆట వస్తువులు, ఓపెన్ జిమ్‌ను పరిశీలించారు. ఏమైనా మరమ్మతులకు గురైతే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు.

'ఎల్‌ఆర్‌ఎస్'లో రాయితీ పొందండి



54వ డివిజన్‌లో పార్కును పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఈనెల 31లోగా ఫీజు చెల్లించి 25 శాతం రాయితీని పొందాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. బుర్హాన్‌పురంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద, కమాన్‌బజార్ షాదీఖానా వద్ద, గాంధీపార్క్‌లో, మామిళ్లగూడెం, శ్రీనివాసనగర్ అయ్యప్పస్వామి టెంపుల్, స్తంభాద్రి నగర్, కొలిపాక ఫంక్షన్‌హాల్, ఇందిరానగర్, వీడీవోస్ కాలనీలోని వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, గొల్లగూడెం వద్ద ఈ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

చెరువుమాధారం చెరువు సర్వే పరిశీలన



సర్వే చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు ఎఫ్‌టీఎల్ సర్వేను ఇరిగేషన్ ఎస్‌ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పడవ ద్వారా చెరువు ఆయకట్టు పరిసరాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మత్స్య సొసైటీ పాలకవర్గం సభ్యులు ఎస్‌ఈకి సమస్యను వివరించగా.. రెవెన్యూ శాఖ సర్వేయర్లు వచ్చి తమ చెరువు విస్తీర్ణం హద్దులు చూపిస్తే కంచె ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు. జిల్లాలో చెరువు శిఖంకు చెందిన భూములను ఇంచు ఆక్రమించినా సహించేది లేదని, వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా అత్యవసమైన చెరువులను నింపేందుకు కార్యచరణ ను రూపొందిస్తున్నట్లు ఎస్‌ఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, ఏఈ నరేష్, చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సెల్‌ఫోన్ల దొంగ

కూసుమంచి: పాలేరులోని వారపు సంతలో ఓ వ్యక్తి సెల్‌ఫోన్లు చోరీ చేసి పారిపోతుండగా.. పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతన్ని స్టేషన్‌కు తరలించి విచారించగా.. మహారాష్ట్రకు చెందిన వాడిగా గుర్తించారు.

ఎంపీడీఓకు వినతి

నేలకొండపల్లి: పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు ఇప్పించాలని మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం ఎంపీడీఓ ఎం.యర్రయ్యకు వినతి పత్రం అందించారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ మండలాధ్యక్షుడు షేక్ రహింతుల్లా మాట్లాడగా.. కార్యక్రమంలో సంఘం నాయకులు బుచ్చిరాములు, అనిత, సైదులు, చంద్రకాంత్, నగేష్, వీరబాబు, బోడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు యూటీఎఫ్..

ఖమ్మం సహకారనగర్: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని కలెక్టరేట్ ఏఓ అరుణకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావులు విన్నవించారు. అదేవిధంగా కుటుంబసర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ఎస్ మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మకు వినతిపత్రం సమర్పించారు. బుర్రి వెంకన్న, వల్లంకొండ రాంబాబు, సురేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



జాతరకు ముస్తాబైన శివాలయం (ఇన్‌సెట్) కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి

జాతరకు వేళాయె..

నేటి నుంచి పండితాపురంలో రామలింగేశ్వరుడి జాతర

- నాలుగు రోజులపాటు ఉత్సవాలు
- 9న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

కామేపల్లి: భక్తుల పాలిట కొంగుబంగారంగా ఉన్న మండలంలోని పండితాపురం గ్రామ శివారులో ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం జాతర ఉత్సవాల వేడుకలకు సిద్ధమైంది. నేటి నుంచి (శనివారం) నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరగనుండగా.. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయంలో ప్రతి ఏటా సంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహాశివరాత్రి తర్వాత వచ్చే ఫాల్గుణశుద్ధ దశమి రోజున జాతర ప్రారంభమై త్రయోదశితో ముగుస్తుంది. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయంలో శివలింగంతో పాటు వినాయక, ఆంజనేయ, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వరుడు దర్శనమిస్తుండడంతో ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 8న ఆలయం తోరణాలంకరణ, స్వామి వారిని పెళ్లి కుమారుడిని చేయడం, అంకుర్పారణ, అఖండ దీపారాధన, 9న మహాన్యాస పూర్వక ఏకాదశి, రుద్రాభిషేకం, రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణం, 10న స్వామి వారి గ్రామోత్సవం,11న పూర్ణాహుతి నిర్వహించనున్నారు.

నాలుగు రోజుల పాటు ఉత్సవాలు..

శాంతియుతంగా జరుపుకోవాలి



నాలుగు రోజుల పాటు జరిగే జాతరకు వచ్చే భక్తులు భక్తిశ్రద్ధలతో, ఎలాంటి వివాదాలకు దారితీయకుండా శాంతియుతంగా జరుపుకోవాలి. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జాతరలో అల్లర్లకు పాల్పడే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

– సాయికుమార్, ఎస్‌ఐ, కామేపల్లి

పటిష్ట బందోబస్తు..

జాతర ఉత్సవాలకు వేలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యాన జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.